**1983 ఉగాది కథానికల పోటీలో రు. 116/-లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ!**



# హంసగీతం

— డా॥ పి. గిరిజ —

**జీవిత యానంలో చిట్ట చివరి మజిలీ చేరాను నేను. మరో రెండు మూడు గంటల్లో ప్రాణం వదుల్తాను. ఈ కొద్దిసేపు కూడా బతకడం కష్టం అనిపిస్తోంది నాకు. మృత్యువు నన్నీ బాధనుంచి ఎంత త్వరగా విముక్తి చేస్తే అంత బాగుణ్ణనిపిస్తోంది నాకు.**

నా చిన్నతనంలో మా స్కూల్లో ఒక క్రిస్టియన్ టీచరుండేవాడు. ఒకసారి క్లాసులో పాఠం చెప్తుండగా ఆయన దృష్టి ఎందుకో పాప పుణ్యాల మీదికి పోయింది.

“కలియుగం అయిపోయి సృష్టి అంతం అయే రోజులు వచ్చాయి. ఇదివరలోలాగా యీ జన్మలో చేసిన పాపానికి మరో జన్మలో శిక్ష అనుభవించడమన్నది పోయి ఏ జన్మలో పాపానికి ఆ జన్మలోనే. అ మాటకొస్తే ఏ రోజు పాపానికి ఆ రోజే. ఏ గంట పాపానికి ఆ గంటలోనే శిక్షలు అమలుచేస్తున్నాడు దేవుడు. ఎందుకంటే యింక మనం ఎన్నో జన్మలెత్తబోవడం లేదుకదా. అందుకని” అని ఒక దేవరహస్యం చెప్పినట్లు చెప్పాడు.

ఆ త్రాగుబోతు మేస్టారు చెప్పిన వేదాంతం నాకు ఆ రోజు అర్ధమూకాలేదు.



ఈనాటివరకు గుర్తూ రాలేదు.

ఈరోజు ఆయనమాటలు గుర్తురావడమే కాదు గుండెలు పిండేస్తు యివేల్టి నా అనుభవం ఆనాటి నా పాప ఫలితమేనని పదే పదే గుర్తు చేస్తూ. నా బాధను తీవ్రం చేస్తున్నాయి.

*　　*　　*

పదిహేనేళ్ళనాటి మాట. మిలిటరీలో పదేళ్ళుండి పెన్షన్ పుచ్చుకుంటున్న నేను గుంటూరు దగ్గర ఒక "క్వారీ"లో "సెక్యూరిటీ గార్డు"గా వుండేవాణ్ణి.

పేరుకు సెక్యూరిటీ గార్డు అయినా మా ఉద్యోగం క్వారీ కంట్రాక్టరు తరపున వర్కర్లపై అజ్మాయిషీచేయడంగా వుండేది. అంటే కాస్త నోటి దురుసు వాళ్ళను రెండు వాయించడమూ. పారిపోయేవాళ్ళను పట్టుకొని బుద్ధి చెప్పడమూ అన్నమాట.

మా క్వారీలో ఎక్కువమంది అరవ దేశస్తులుండేవాళ్ళు. ఓ నాలుగైదు కుటుంబాలు మటుకు రాయలసీమ నుంచి వచ్చిన వాళ్ళు. అందరూ తలా వెయ్యీ.రెండువేలూ అడ్వాన్సుగా తీసుకుని వచ్చిన వాళ్ళే. నలుగురైదుగురున్న కుటుంబం నెల మొత్తంమీద ఆరు. ఏడు లారీల రాయి కొట్టేవాళ్ళు. అప్పట్లో లారీకి నలభై రూపాయలిచ్చేవాళ్ళు. (ప్రేలుడు) మందు కింద పాతిక ముప్పై రూపాయలు కోతపెటే వాళ్ళు. మిగతా డబ్బులోనే వాళ్ళ యిల్లు గడిచి పాతికో పరకో వడ్డీ కింద జమచేసేవాళ్ళు. అయినా ఏ జ్వరమో దగ్గో పట్టుకుంటే మళ్ళీ కాంట్రాక్టరు అప్పు యివ్వాల్సి వచ్చేది. దాంతో అసలు బాకీ ఏడాదికో వంద రెండు వందల చొప్పున పెరిగేదేకాని తగ్గేదికాదు. అందుకే అతి తెలివిగాళ్ళు పారిపోయేందుకు ప్రయత్నం చేసేవాళ్ళు.

పని వాళ్ళల్లోనే మా తరపు మనుషులుండేవాళ్ళు. ఎవరెవరేమనుకుంటున్నదీ. ఎవరు పారిపోజూస్తున్నదీ మాకు సమాచారం చేరవేసేవాళ్ళు. అలాంటప్పుడు పారిపోవాలనుకున్నవాళ్ళ పిల్లల్ని రాత్రులు ఒక షెడ్‌లో పడేసి తాళంపెట్టేవాళ్ళం. చచ్చినట్టు వాళ్ళ ప్రయత్నం మానుకునేవాళ్ళు.

ఒకసారి కందసామి అనేవాడి కుటుంబం పారిపోవాలనుకుంటున్నట్లు రంగనాధన్ అనే వర్కరు మాకు వచ్చి చెప్పాడు. వాడి కూతురు చిన్నపొన్ను అని ఆరేళ్ళపిల్ల వుండేది. దాన్ని మేమొక గదిలో తాళంవేసి పెట్టాం.నాలుగైదురోజులు ఏమీ జరగలేదు. ఒకరోజున తెల్లారేసరికి కందసామి. వాడి పెళ్ళాం పారిపోయినట్లు తెలిసింది.

షెడ్ దగ్గరకి పోతే తాళం పగలగొట్టి పిల్లను తీసుకుపోయినట్టు అర్థమయింది!

నన్ను పక్కకిపిలిచి చెప్పాడు రంగనాధన్- యీ పని చేసింది తంగవేలు అని. మొదట్లో నేనునమ్మలేదు.సొట్టకాలు. గట్టిగా గాలి వీస్తే ఎగిరిపోయేలా వున్న తంగవేలు యింతపని చేస్తాడా అని నా అనుమానం.

వాడేదన్నా వివరాలు చెప్తే పారిపోయిన వాళ్ళను పట్టుకు రావచ్చని తంగవేలును పిలిపించి అడిగేము. భయపెట్టాము. బతిమాలాము. బహుమానం యిస్తామన్నాము. చివరికి వాతలు పడేలా నా లాఠీతో నేను కొట్టేను. వాడు "అమ్మా" అని అనలేదు. నోరు విప్పి ఒక్కమాటా మాట్లాడలేదు. ఒకటే వాడి సమాధానం. "నాకుతెలీదు"అని.

వాడి తల బిరుసు తనం వల్ల ఆ రోజు నుంచి చాలాసార్లు నాచేత తన్నులుతిన్నాడు. కాని ఒక్కసారీ వాడిచేత తప్పు ఒప్పించలేకపోయాను. అది అవమానంగా తోచేది కామోసు. రోజురోజుకూ వాడిమీద నాకు కసి పెరగసాగింది. దెబ్బల తీవ్రత ధాటీ పెరిగింది.

ప్రతి పదిహేను రోజులకూ "బట్వాడా" జరిగేది. వీడి ప్రోద్బలంతో పనివాళ్ళు కంకర కొలతల్లో తేడా వుందనో. మందు (ప్రేలుడు మందు) కు ఎక్కువ వసూలు చేస్తున్నామనో పేచీ పెటేవాళ్ళు. నేను



## పరిచయం

నా కథ హంసగీతంను కన్సొలేషన్ బహుమతి ప్రకటించినందుకు కృతజ్ఞతలు.

నా గురించి —

వైద్యశాస్త్రంలో పట్టాపొందిన నేను సాహిత్యంలో కె. జి. క్లాసేనని నా అభిప్రాయం. కొ.కు, రా.వి, శా.రా లు నా అభిమాన రచయితలు. సాహిత్యం అంటే "కదిలేదీ, కదిలించేదీ మారేదీ, మార్పించేదీ" అని నా విశ్వాసం. నా అభిమాన రచయితల వరవడిలో శ్రీశ్రీ నిర్దేశం మేరకు ఒక్క రచనైనా చేయాలని కోరిక.

—గిరిజ పి.

కలగజేసుకుని తంగవేలును నాలుగు బాదేవాణ్ణి. కానీ వాడి వాదన వాడు మానుకునే వాడు కాదు.

తంగవేలు ఒంటిగాడు. వాడికి నా అనే వాళ్ళెవరూ మా వర్కర్లలో లేరు. వాడి పొగరు చూసి వర్కర్లు సంతోషంగానే వుండేవాళ్ళు కానీ వాడిని అనుసరించి మమ్మల్నెదిరించడానికి జడిసేవారు.

మా కాంట్రాక్టరు ప్రసాద్‌గారు బహు దొడ్డ మనిషిని. వర్కర్లెవరేనా పోదల్చుకుంటే తన అడ్వాన్సు కట్టి పొమ్మని అనేవారు. వడ్డీ అక్కర్లేదని ఆయనే చెప్పేవారు. నేనంటే ఆయనకు భలే అభిమానం. "నువ్వు టైగర్ లాంటి వాడివి. నువ్వొచ్చాక మన క్వారీలో గొడవలు తగ్గాయి. ఎవరి పని వారు చూసుకుంటున్నారు. అంతా సవ్యంగా వుంది" అని మెచ్చుకునేవారు.

ఒకసారి మందు పెట్టి కొండ పేలుస్తుంటే మునుస్వామి అనే పనివాడికి చేతి వేళ్ళు తెగినై. అప్పుడు గుంటూరు ఆసుపత్రిలో చేరిస్తే నాలుగు వందల దాకా ఖర్చయింది. ఆ డబ్బంతా ప్రసాద్‌బాబుగారే అప్పుగా సర్దారు. మునుస్వామి అప్పటికే పన్నెండు వందలు బాకీ అని అందుచేత యీ డబ్బు హామీలేనిదే యివ్వవల్లకాదని గుమాస్తాగారు చెబితే యీ తంగవేలుగాడు నేను హామీ అని ముందుకు వచ్చాడు. అయ్యగారు సరే అన్నారు.

ఈ వెధవ కర్మకాలి వాడు ఆసుపత్రి నుంచి అట్నించటే పరారయ్యాడు. "వాడివ్వాల్సిన పదహారువందలూ నీ బాకీకి కలుపుతాను" అని అయ్యగారంటే తంగవేలు పేచీకి దిగాడు "నేను హామీ ఉన్నది నాల్గు వందలకే" అని.

పేచీకిదిగి నాచేత చావుదెబ్బలుతిన్నాడు. కాని మొండిపట్టు విడవలేదు. చివరికి విసుగెత్తి అయ్యగారే "నీ యిష్టం వచ్చినట్లు ఏడువ్. కుక్కైతీర్చుకోవాలరా నా డబ్బు" అని వూరుకున్నారు.

అలాగ మొండితనంతో నెగ్గుకొచ్చాడు వాడు. కాని, ఆ మొండితనమే వాడి ప్రాణం తీస్తుందని వాడు కానుకోలేకపోయాడు.

అవి డిసెంబరు నెల చివరి రోజులు. అప్పుడే యింకా పూర్తిగా తెల్ల వారలేదు. రంగనాథన్ పరుగెత్తుకుంటూ వచ్చాడు. "క్వారీదగ్గర యాక్సిడెంట్ అయింది. కరుప్పాయి చచ్చిపోయింది" అంటూ. నేను కోటు తగిలించుకుని లాఠీ పుచ్చుకు బయల్దేరాను.

కరుప్పాయి అరవై ఏళ్ళ ముసిల్ది. ఇద్దరు కొడుకులు దానికి. పెద్దవాడు నల్లతంబికి పెళ్ళైంది. ఇద్దరు పిల్లలు కూడా. రెండవ వాడికి పెళ్ళికాలేదు. మందుపెట్టి కొండ రాళ్లు పేలుస్తున్నారట. ఒకరాయిపేలి కిందికి దొర్లుకుంటూవెళ్ళి కరుప్పాయి కాళ్ళ మీద పడిందిట. రెండుకాళ్ళూ మోకాళ్ళ కిందికి విరిగి అవతల పడ్డాయిట. చాలా సేపు ఎవరూ కనుక్కోకపోడాన కామోసు నెత్తురుపోయి చనిపోయిందట.

మేం వెళ్ళేటప్పటికి జనం అంతా అక్కడ చేరారు. కరుప్పాయి శవం మీద పడి కొడుకులూ, కోడలూ ఒకరిద్దరు ఆడవాళ్లు గోలుగోలున ఏడుస్తున్నారు.

నేను ఏక్సిడెంటెలా జరిగిందని వాళ్ళనీ వీళ్ళనీ అడుగుతున్నాను. ఇంతలో ఎవరో నల్లతంబిని పిలుచుకు వెళ్లారు. నేను తిన్నగా శవం దగ్గరికి చేరిచూద్దును కదా శవం కాళ్లు రెండూ మోకాళ్ళ వరకూ తెగిపోయాయి. అయితే ఆ విరిగిపోయిన కాళ్ళు రెండూ అక్కడ లేవు. ఎవర్ని అడిగినా "మాకు తెలీదు" అంటూ మొహం తిప్పుకున్నవాళ్ళే తప్ప జవాబు చెప్పినవాళ్ళు లేరు. మతిపోయినట్లై రంగనాథన్‌ను పక్కకు పిలిచి అడిగాను "సంగతేమిటని". కనుక్కుంటాను అన్నట్లు సైగచేసి వెళ్ళాడు రంగనాథన్.

నేను ప్రసాద్‌బాబు దగ్గరికి వెళ్ళి సంగతి మనవిచేశాను. అప్పుడే మొహం కడిగి కాఫీ తాగుతున్నాడాయన. విషయం తెలుసుకుని బాధపడ్డాడు. ఆ తర్వాత శవం కాళ్లు కనిపించడంలేదన్న విషయమూ చెప్పేను.

క్షణం ఆలోచించి "దానికాళ్ళకు వెండి కడియాలున్నాయి శ్రీనివాసులూ. అందుకే శవం కాళ్ళకు కాళ్ళొచ్చాయి. ఇక మన బాకీ గోవిందా. మనం దద్దమ్మలమని వాళ్ళ ఉద్దేశం శ్రీనివాసులూ" అన్నారాయన.

దెబ్బ తగలాల్సినచోటే తగిలింది. నన్నెప్పుడూ ఆ బాబు ఎలాంటి మాట అనలేదు. "మిలట్రీవాడివికదా అలవాటయ్యుంటుంది. మంచి సీమసరుకు రుచిచూడు" అని ఫారిన్ రమ్ సీసాలిచ్చేవాడు. "బ్రాయిలర్ చికెన్ అంతా కందే. తిన్నూచాడు" అని పొట్లాలంపేవాడు. ఎలాంటి సమయంలో కూడా మా టైగర్నిపంపుతాను చూడండనేవాడు.

అలాటివాడు మనం దద్దమ్మల మనగానే నాకు వళ్ళంతా పూనకం వచ్చినట్లయింది. యుద్ధభేరీలు విన్న యోధులకులాగా వీరావేశం వచ్చింది. నేను-బయల్దేరాను.

దారిలో రంగనాధన్ ఎదురయ్యేడు. విషయం తేలిపోయింది. తంగవేలుగాడు రెండు కాళ్ళూ గోనె సంచిలో వేసుకెళ్ళి నల్లతంబి కప్పగించేట్ట. కంసాలిచేత కడియాలు తీయించాక కాళ్ళు శవం దగ్గిరికి చేర్చేరుట. తంగవేలు పేరు వినేటప్పటికి నాకు శివమెత్తినట్లయింది. కోపంతో నా వళ్ళు వణుకుతుంటే నాకే భయంవేసింది.

తంగవేలు కోసం తిరగసాగాను. పది గజాలు నడిచేటప్పటికి ఎదురయ్యాడువాడు. కోపం పట్టలేక, "ఏరా లంజకొడక, శవాల కాడ దొంగతనాలు మొదలెట్టావురా? కబుర్లు సెప్తావు కూడాను." అంటూ వాడి సమాధానికి ఎదురు చూడకుండానే ఆ చెంపా, యీ చెంపా వాయించాను. వాడు జవాబు చెప్పలేదు.

"నిన్నేరా ఎదవ నా కొడక." అంటూ వాణ్ణి నా ఎదరకు లాక్కుంటూ జవాబు చెప్పమని నిలదీశాను.

"నేను దొంగతనం చేయలేదు. దొంగల చేతబడకుండా ఎవరి సొమ్ము వాళ్ళకు చేర్చాను" అన్నాడు.

"ఏరా ఎదవ నా కొడక. ఎవర్రా దొంగలు. నువ్వు దొరవూ, మేవు దొంగలమూనా. వర్రా మేం చేసిన దొంగతనమూ, పట్టుకున్న నీ దొరతనమూను?" వాడి మెడచుట్టూ నాచేతులు బిగుస్తుంటే రొక్కించిఅడిగాను.

"నేను ఎవర్నీ ఏమీ అనడం లేదు. చంద్రన్‌కు జరిగినట్లు మళ్ళీ జరగకూడదనే యిట్లా చేశాను."

ఇక నేను రాక్షసుణ్నే అయ్యాను. ఈ చంద్రన్‌గాడు అయ్యగారికి రెండువేలు బాకీపడ్డాడు. వాడేదో జబ్బు చేసి చచ్చాడు. వాడి చెవులకు బంగారపు పోగులుండేవి.

అయినా బాకీ కింద తీసుకుంటానని ప్రసాద్ బాబు అంటే ఆ పోగులూ, జబ్బకు రెండు వెండి తాయెత్తులుంటే అవీ నేనే కత్తిరించాను. వీడి ఎత్తిపొడుపు అదనపుమాట.

కోపం పట్టలేకపోయాను. లాఠీతో వళ్ళంతా వాయగొట్టేను. కిక్కురు మనలేదు వాడు. దెబ్బమీద దెబ్బ విసుగొచ్చేంత వరకూ కొడ్తూనే వున్నాను. చివరికి లాఠీతో నెత్తిన ఒక్కటి పెట్టాను. వాడు నెత్తిన చేతులు పెట్టుకుని అబ్బా అంటూ ముందుకు పడిపోయాడు. ఏమయిందో మరి. రెండు నిముషాలు వాడు బాధతో మెలికలుతిరిగాడు. అంతే. వాడికేదో ప్రమాదం జరిగిందని నేను చూస్తూనే వున్నాను. వాడు ప్రాణాలు వదిలాడు.

రొప్పుకుంటూ వచ్చాడు నల్లతంబి—

"శ్రీనివాసులూ ఇవిగో కడియాలు వాణ్ణొదిలెయ్" అంటూ. అప్పటికే అంతా అయిపోయింది.

* * *

ఆరాత్రే ప్రసాద్‌బాబు నన్ను టాక్సీలో ఊరుదాటేశాడు. రెండువేలు చేతబెట్టి యిక పల్లెకి వద్దులే అన్నాడు. పనివాళ్ళతో, పోలీసులతో ఏం తిప్పలు పడ్డారో కేసుజరగ లేదు.

కానీ ఆనాడు ఏ శిక్ష తప్పించుకున్నానో నాకు తెలియదు కానీ, ఈ వేళ నేను అనుభవించిన వేదనకన్నా ఎలాటి శిక్ష అయినా మేలే అనిపిస్తోంది.

నాల్గు నెలల క్రితం నాకు జీరకోశం కాన్సర్ అని నిర్ణయించారు డాక్టర్లు. నెల రోజుల్నించి నోటివెంట రక్తం పడుతోంది. పేరుకు ఏదో వైద్యం జరుగుతోంది. "వైద్యం చేసినా ప్రయోజనం లేదుట నాన్నా" అనే కొడుకుతో ఏం చెప్పను?

రెండేళ్ళ క్రితమే భార్య పోయింది. కోడలు అప్పుడప్పుడూ భోజనం, ఎల్లప్పుడూ తిట్లూ పడేస్తుంటే నన్ను కాదన్నట్లు రోజులు వెళ్ళదీస్తున్నాను.

పదిరోజులుగా పరిస్థితి విషమించినట్లయింది రెండురోజులై వంటిమీద స్పృహలేదు. ఎందుకో యివ్వాళే కాస్త తేలికగా వుంది. కాని యిది దీపం ఆరిపోయేముందు వెలిగే వెర్రి వెలుగని నాకు తెలుసు.

ఎడమచేతివేలు విపరీతంగా సలుపుతుంటే వేలుకేసిచూశాను. వేలిసఉండాల్సిన ఉంగరం లేదు. సరికదా వేలిమీద యింతలోతున కత్తెర గుచ్చుకున్న గుర్తు కనిపిస్తోంది. నేను కాలుకేసి చూసుకుంటుంటే నాకొడుకు లోపలికి వచ్చి, సంగతి గమనించి, "నేనే నాన్నా. వేలు వాచినట్లుంటే బిగుసుకు పోతుందనీ తీయించాను" అని నసిగాడు.

ఎట్నుంచి వచ్చిందో కోడలు. "తీసి మనం దాచుకోలేదుకదా, అమ్మి డాక్టర్లకూ, మందులకూ పెట్టేం కానీ" అని దీర్ఘాలు తీసింది.

బాధగా కళ్ళు మూసుకున్నాను నేను. కళ్ళు నేను తెరవలేకపోతున్నానో, యిష్టంలేక తెరవడం లేదో నా కర్థమవడం లేదు. అంతా గజిబిజిగా వుంది.

నా ఆస్తి అంతా వాడి చేతుల్లో పెట్టేందుకు నేను ఆలోచించలేదు. ఆస్తి అంతా అప్పగించినందువల్లే నిన్నిలాచూస్తున్నారని అన్న వాళ్ళ మాటలు వినలేదు. నాకు తిండి సరిగా పెట్టకపోతే బజారున్న పడలేదు. ముసిలాడంటే వయసులో అలా అనిపిస్తుందిలే అని సరి పెట్టుకున్నాను. విసుక్కుంటుంటే నోరుమూసుకున్నాను. వైద్యం అనవసరం అంటే అలాగే అన్నాను. అలాటిది నా కన్న కొడుకు, నా చేతుల్తో నేను పెంచి పెద్దచేసిన వాడు నా వంటిన వున్న ఒక చిన్న వస్తువు కోసం నేను బతికి వుండగానే నన్ను గాయపరిచేందుకు సిద్ధపడడం నాకు వాడి మీద కాదు, నా మీదనే నాకు అసహ్యం కలిగించింది. ఇది తమ్ముళ్ళు, చెల్లాయిల కళ్ళపడకుండా కాజేయడం వాడి వుద్దేశం కావొచ్చు. నేను మళ్ళీ కళ్ళు తెరిచి యిది చూస్తానని వాడు అనుకొని వుండక పోవచ్చు.

కానీ.... కానీ యిది శవాల నుంచి బాకీలు వసూలు చేసిపెట్టిన నా పాపకర్మకు ఫలితం కాదా? కావచ్చు. కానీ యీ పని మరెవ్వరు చేసినా నేను భరించగలిగే వాణ్ణేమో కానీ నా కొడుకు చేత చేయించి నాకు మంచి శిక్ష విధించేవు భగవాన్.

ఇదంతా నిజంకాకపోవచ్చు. పాపం పుణ్యం శిక్షలూ లేకపోవచ్చు. ఎందుకంటే నేను ఆ పనులన్నీ ప్రసాద్‌బాబు కోసం చేసేను. మరి ఆయన రోజుకు రెండు మెట్లు చొప్పున పైకి పోతున్నాడు. రెణ్ణెల్ల క్రితం ఆయన ఎం. ఎల్. ఏ కూడా అయినాడు.

అందుకే పాపం పుణ్యం జోలికిపోకుండా కూడా జనం మరికాస్త మనుషులుగా బతికితే చాలని నాకోరిక. పశువులుగానో, మృగాలుగానో, మారకూడదని నా జీవితం హెచ్చరిక కాదా.

ఏమో జనం యిలాటివాటికలవాటయినట్లే వుంది. మారకపోవచ్చు. నా గొంతు తడారిపోతోంది. నా ప్రాణాలు పోతున్నై. నేనింక చెప్పాల్సింది ఏమీ .... .... ★



'యువతరానికి' చర్చావేదిక

## "స్త్రీలకు ఉద్యోగాలలో ప్రత్యేక రిజర్వేషన్లు అవసరమా? (వుంటే ఎలా? ఎంతమేరకు ?)"



ఈ అంశంపై యువతీయువకుల నుంచి అచ్చులో ఒక పేజీకి మించని వ్యాసాలను ఆహ్వానిస్తున్నాము. తమ అభిప్రాయాలను హేతుబద్ధమైన కారణాలతో చక్కగా వివరించినవారికి వ్యాసానికి రూ. 30/- పారితోషికం వుంటుంది. వ్యాసాలు పంపేవారు తమ ఫొటోను కూడా విధిగా ప్రచురణకు పంపాలి.

మీ వ్యాసాలను—

"యువతరానికి చర్చావేదిక", ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, పోస్ట్ బాక్స్ నెంబరు 712, విజయవాడ–520 010కు 31–5–1983 లోగా పంపాలి. ప్రచురణకు యోగ్యంకాని వ్యాసాలను తిప్పి పంపటానికి తగు పోస్టేజి అంటించిన కవర్లను జతచేయాలి.

—ఎడిటర్